ఏం జరుగుతుందో.. ఏమో!



(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు (4వ తేదీ మంగళవారం) జరగనుంది. కౌంటింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ రోజు జిల్లా వ్యాప్తంగా కర్ఫ్యూ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ప్రకటించారు. గొడవలు జరగకుండా చూస్తున్నారు. అయితే ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామక్రిష్ణారెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు కౌంటింగ్ రోజున హైటెన్షన్‌కు దారి తీస్తున్నాయి. రూల్ కాదేమో అని వెనక్కి తగ్గే వారు కౌంటింగ్ ఏజంట్లుగా వద్దు, మన టార్గెట్ ఇది అని దృష్టిలో పెట్టుకుని.. దానికి అవసరమైనవి తెలుసుకోవాలి... మనవి ఒక్క ఓటు కూడా చెల్లనివిగా చేసే పరిస్థితి రాకుండా ఏం చేయాలో చూసుకోవాలి. రూల్ అలా ఉంది కాబట్టి ఆ ప్రకారం పోదామని కూర్చోవద్దు. మనకు అనుకూలంగా, అవతలి వాళ్ల ఆటలు సాగకుండా రూల్ ఎలా తీసుకోవాలి, ఎంత ఫైట్ చేయాలనేది నేర్చుకున్నాం. కౌంటింగ్ ఏజెంటు తనవంతు పాత్ర పోషించేలా వారి మెదళ్లలోకి మీరు బాగా ఎక్కించాలంటూ ఇటీవల సజ్జల రామక్రిష్ణరెడ్డి వ్యాఖ్యలు చేశారు. అది బాగా చర్చనీయాంశంగా మారింది. రెచ్చగొట్టే విధంగా ఉందంటూ సజ్జలపై తాడేపల్లిలో కేసు కూడా నమోదైంది. సజ్జల వ్యాఖ్యలతో కౌంటింగ్ రోజు ఎలాంటి వివాదాలకు దారి తీస్తుందో అన్న చర్చ నడుస్తుంది.

జిల్లాలో ఈసారి సార్వత్రిక ఎన్నికలు ఇటు టీడీపీ, అటు వైసీపీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. దీంతో పోలింగ్ కూడా నువ్వా నేనా అన్నట్లుగా సాగింది. పోలింగ్ ముగిసి కౌంటింగ్‌కు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో అభ్యర్థులతో పాటు ఇరు పార్టీల కేడరులోను హైటెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో శనివారం వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే అధికారమని 35 సర్వే సంస్థలు అంచనా వేశాయి. ఇక కేకే సర్వే అయితే కడప పార్లమెంటు పరిధిలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు టీడీపీ కైవసం చేసుకుంటుందని, జమ్మలమడుగు బీజేపీ గెలుస్తుందని.. కడప పార్లమెంటు కూడా టీడీపీ గెలుస్తుందని అంచనా వేసింది. పులివెందుల, బద్వేలు అసెంబ్లీస్థానాలు మాత్రం వైసీపీ గెలుచుకుంటుందని వెల్లడించింది. కూటమి అధికారంలోకి వస్తుందని మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో సజ్జల రామక్రిష్ణారెడ్డి కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు రూల్ కాదేమోనని వెనక్కి తగ్గేవారు ఏజెంట్లుగా వద్దంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దీంతో వైసీపీ కౌంటింగ్ సందర్భంగా దేనికైనా సిద్ధమనే సంకేతం పంపిస్తుందనే విమర్శ ఉంది.

ఏజెంట్ల కోసమే.. స్వతంత్ర, ఇతర పార్టీ అభ్యర్థుల తరపున పోటీ

ఎన్నికల బరిలో ఉన్న ప్రతి అభ్యర్థి టేబుల్‌కు ఒకరు చొప్పున కౌంటింగ్ ఏజంటుగా నియమించుకోవచ్చు. అదనంగా రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్దకు ఉండేందుకు ఒక ఏజంటు, పోస్టల్‌బ్యాలెట్ పరిశీలనకు ఏజెంటుగా నియమించుకోవచ్చు. ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. దీంతో అవసరమైన ఏజంట్లను నియమించుకోవచ్చు. అయితే ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులు వారి అనుచరులను, ఇతర పార్టీల వారిని ఏజెంట్లుగా నిలిపారు. కడప అసెంబ్లీ నుంచి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మూడోసారి పోటీ చేస్తున్నారు. ఈయన తమ్ముడు అహ్మద్‌బాషా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇక ప్రొద్దుటూరులో వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పోటీ చేస్తుండగా, ఆయన బావమరిది బంగారు మునిరెడ్డి ఆలిండియా ఫార్వర్డ్‌పార్టీ నుంచి పోటీ చేశారు. ఇక పులివెందులలో కూడా సీఎం జగన్ సన్నిహితులు కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. మరికొంత మంది టీడీపీకి మద్దతుగా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఏజెంట్ల కోసమే వీరంతా వివిధ పార్టీల తరపున పోటీ చేశారు.

కౌంటింగ్ రోజు ఏ విధంగా ప్రవరిస్తారో..

జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో పోలింగ్‌రోజు ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యే మాధవీరెడ్డి మధ్య నువ్వా నేనా అన్నట్లు పోరు సాగింది. ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. పోలింగ్‌రోజు రాత్రి గౌస్‌నగర్‌లో ఘర్షణ చోటు చేసుకుంది. ఇక డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషా చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతకు దారి తీసింది. ఇక ప్రొద్దుటూరులో బంగారురెడ్డి తన మ్యానియాను చూపిస్తున్నారు. దీంతో పాటు మరికొంత మంది వైసీపీ నేతలంతా వివిధ పార్టీల తరపున పోటీ చేశారు. అవసరమైన ఏజంట్లను నియమించుకున్నారు. అయితే సజ్జల వ్యాఖ్యల నేపథ్యంలో కౌంటింగ్ రోజు వైసీపీ ఏజెంట్లు ఏవిధ ంగా ప్రవర్తిస్తారనే ఆందోళన ఉంది.

గొడవలు జరగకుండా పోలీసుల చర్యలు

ఇప్పటికే కౌంటింగ్ రోజు ఎలాంటి గొడవ జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. పోలింగ్‌కు ముందు 18620 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. పోలింగ్ కు ముందు, పోలింగ్ అనంతరం జరిగిన ఘర్షణలో పలువురిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. 1038 మందిపై రౌడీషీటర్లలో 21 మందిని జిల్లా బహిష్కరణ చేశారు. 652 మందిని గృహ నిర్బంధం, 131 మందిని అరెస్టు చేయనున్నారు. కడప, జమ్మలమడుగు, మైదుకూరు నుంచి 21 మందిని జిల్లా బహిష్కరణ చేశారు. వీరంతా 7వ తేదీ వరకు జిల్లాలో ఉండకూడదు. అయితే కౌంటింగ్ అనంతరం గొడవలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అయితే సజ్జల వ్యాఖ్యల నేపథ్యంలో కౌంటింగ్ రోజున వైసీపీ ఏజెంట్లు ఎలా రియాక్ట్ అవుతారన్నది హాట్ టాపిక్ మారింది.

- సజ్జల వ్యాఖ్యలతో కౌంటింగ్‌పై హైటెన్షన్
- రూల్ కాదేమో అని వెనక్కి తగ్గేవారు ఏజంట్లుగా వద్దన్న సజ్జల
- స్వతంత్ర, ఇతర పార్టీల అభ్యర్థులుగా వైసీపీ నేతల పోటీ
- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు బావమరిది బంగారురెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తమ్ముడు ఎన్నికల బరిలో..
- గుర్తింపు పొందిన, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు ఏజంట్లుగా వెళుతున్న వైనం



కౌంటింగ్ నేపథ్యంలో
పటిష్ఠ ఆంక్షలు

- ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దు
- కడప నగరంలో 144 సెక్షన్ అమలు
- నగర శివార్ల నుంచి బస్సులు, ఇతర వాహనాల దారి మళ్లింపు
- ఎస్పీ సిద్ధార్థ కౌశల్



కడప (క్రైం), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఈనెల 4న మంగళవారం కడప నగరంలో పటిష్ఠ ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తెలిపారు. నగరంలోకి ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. నగర శివార్ల నుంచి వాహనాలు మళ్లించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. నగరంలో 144 సెక్షన్ కింద నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు.

వాహనాల దారి మళ్లింపు

- రాయచోటి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను కడప నగరంలోకి అనుమతించరు. కడప మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఊటుకూరు సర్కిల్, సాక్షి సర్కిల్, ఇర్కాన్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగు రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంటుంది.
- పులివెందుల వైపు నుంచి వచ్చే వాహనాలకు సాక్షి సర్కిల్ వరకు మాత్రమే అనుమతిస్తారు.
- రాజంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు రామాంజనేయపురం మీదుగా ఇర్కాన్ జంక్షన్ రహదారిపై గమ్యస్థానానికి చేరుకోవాలి.
- మైదుకూరు, కమలాపురం వైపు నుంచి వచ్చే వాహనాలు ఇర్కాన్ సర్కిల్ మీదుగా వెళ్లాలి. ఎట్టి పరిస్థితుల్లో స్థానికులు తప్ప ఇతరులను నగరంలోకి అనుమతించరు. స్థానికులైతే తప్పనిసరిగా గుర్తింపుకార్డు చూపిస్తేనే నగరంలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తారు.

పార్కింగ్ ప్రదేశాలు

వైసీపీ ఏజంట్లకు, అభ్యర్థులకు ఇందిరానగర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌లో తమ వాహనాలను పార్కింగ్ చేయాలి. టీడీపీ ఏజంట్లకు, అభ్యర్థులకు శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌లో వాహనాల పార్కింగ్ చేయాలి. పార్కింగ్ ప్రదేశాల నుంచి అభ్యర్థులు, ఏజంట్లను ప్రత్యేక బస్సుల ద్వారా కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్లడం జరుగుతుంది. కాగా, అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ ప్రారంభానికి రెండు గంటల ముందే అంటే.. ఉదయం 6గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. 7 గంటలు దాటిన తరువాత వచ్చిన వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించమని ఎస్పీ తెలిపారు.

నాలుగంచెల పటిష్ఠ భద్రత

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. స్థానిక మౌంట్‌ఫోర్ట్ స్కూలులో ఆదివారం బందోబస్తు విధులపై వెళ్లే సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులతో పాటు కేంద్ర సాయుధ పోలీ సు బలగాలు, ఏపీఎస్పీ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీ సు అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ)లు సిద్ధంగా ఉంటాయని, ఎలాంటి ఘటన గురించి సమాచారం వచ్చిన వెంటనే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారని ఎస్పీ తెలిపారు. అనంతరం కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే రహదారిపై అభ్యర్థులు, కౌంటింగ్ ఏజంట్లను అనుమతించే దారులను, ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఎస్పీ పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) లోసారి సుధాకర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, రిమ్స్ సీఐ కె.రామచంద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కొండెక్కిన కూరగాయలు

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమోటా ధరలు మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో పంటల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్ని రకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- చుక్కలు చూపిస్తున్న ధరలు
- పచ్చిమిర్చి రూ.120
- మటిక్కాయలు రూ.80
- కొత్తిమీర కట్ట రూ.75
- తగ్గేదేలేదంటున్న చికెన్, కోడిగుడ్ల ధరలు
- సామాన్యుడు కొనడం కష్టమే



కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 2: కడప నగరంలో ఏరోజుకారోజు కూరగాయలు కొనుగోలు చేయడం ఎక్కువ. దీంతో చాలా మంది తోపుడుబండ్లపై కాలనీల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయి స్తుంటారు. కానీ ప్రస్తుతం కూరగాయాల ధరలు అధికంగా ఉండడంతో తోపుడుబండ్ల వారు రావడమే మానేశారు. మార్కెట్లో కిలో బీన్స్ రూ.150 పలుకుతుండగా పచ్చిమిర్చి రూ.120 ఉంది. మటిక్కాయలు రూ.80, క్యారట్, కాకర రూ.80, అలసంద కిలో రూ.100, బెండ రూ.80, దొండ రూ.60, బంగాళా దుంపలు, చామ దుంప, క్యాబేజీ ధర అయితే రూ.50కి పైగానే. టమోటా ధర రూ.35 నుంచి రూ.40 పలుకుతుండగా రిటైల్‌గా రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. కొత్తిమీర కట్ట రూ.75నుంచి రూ.85కు విక్రయిస్తున్నారు. అలాగే మునగకాయలు కేజీ రూ.60, అల్లం రూ.200 పలుకుతుంది. కూరగాయలన్నీ కొండెక్కి కూర్చోవడం సామాన్యునికి భారంగా మారిందని చెప్పవచ్చు.

కోడిగుడ్ల ధరలు అదే బాటలో...



మార్కెట్లో మటన్, చికెన్ ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యులకు అందుబాటులో ఉండే కోడిగుడ్లు ధరలు సైతం అమాంతం పెరిగాయి. ఎండాకాలం కావడంతో కోళ్ల ఉత్పత్తి ఆశాజనకంగా లేకపోవడం వల్ల సరఫరా తగ్గి డిమాండ్ పెరిగింది. ఎండవేడిమికి కోళ్లు చనిపోతున్నాయని... దీంతో చికెన్, కోడిగుడ్ల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతు న్నారు. ప్రస్తుతం 30 గుడ్ల ధర రూ.180కి పలుకుతున్నాయి. హోల్‌సేల్‌గా ఒక్కో కోడిగుడ్డు రూ.6 కాగా రిటైల్ ధర 7 నుంచి 8 వరకు ఉంది. కోడిగుడ్ల ధరలు కూడా అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు అల్లాడుతున్నారు.

చికెన్ కొనాలంటే భయపడే పరిస్థితి..

చికెన్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రజలకు చికెన్ కొనాలంటే ధర చూసి భయపడే పరిస్థితి నెలకొంది. కిలో చికెన్ మార్కెట్లో రూ.260కి విక్రయిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. బ్రాయిలర్ పౌల్ట్రీలో డిమాండుకు తగినట్లుగా చికెన్ లేకపోవడంతో బయట ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. వేసవి తీవ్రత పౌల్ట్రీ సాగుపై పడుతుందని.. ఫిబ్రవరి నుంచి సాగు తగ్గించినట్లు సమాచారం. ఈ మేరకు చికెన్ డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో కిలో రూ.180 నుంచి 200 ఉండే చికెన్ ధర ప్రస్తుతం రూ.260కి చేరింది.

నియోజకవర్గాల వారీగా విధుల కేటాయింపు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



కడప(కలెక్టరేట్) జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాల వారీగా విధులను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎస్‌పీసీ హాలులో జిల్లా ఎన్నికల పరిశీలకులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె, జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలసి కౌంటింగ్ సిబ్బందికి నియోజకవర్గాల వారీగా విధులను కేటాయించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బందికి ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణా తరగతులకు గైరాజరైన సిబ్బందిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జూన్ 4న ఉద యం 5 గంటకు మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి, ఏయే టేబుళ్లల్లో కౌంటింగ్ నిర్వహించాలో తెలపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వెంకట్రావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలా..?

- విధుల్లో ఉంటూ గన్‌తో కాల్చుకుని.. ● మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



వేదవతి (ఫైల్)

రాయచోటి టౌన్, జూన్ 2: రాయచోటి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న కబ్బాలి వేదవతి (28) ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే... చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బింగానిపల్లె చెందిన వేదవతి 2016లో పుంగనూరులోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం శిక్షణ తీసుకుంటుండగా అక్కడే ఫ్యాకల్టీగా పని చేస్తున్న మదనపల్లెకు చెందిన దస్తగిరితో ప్రేమలో పడి 2016లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో 2017లో వేదవతికి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. దీంతో వేదవతి చిత్తూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సంవత్సరం క్రితం బదిలీపై అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చింది. ప్రస్తుతం దస్తగిరితో కలిసి వేదవతి రాయచోటి పట్టణంలోని రాజీవ్ స్వగృహ పక్కన గల ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటోంది. ఇదిలా ఉండగా వేదవతి భర్త దస్తగిరికి గతంలోనే వివాహం జరిగి ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. మొదటి భార్య దస్తగిరిని వదిలి వెళ్లిపోవడంతో అతడి ఇద్దరు కుమారులు ప్రస్తుతం మదనపల్లెలోని నానమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. ప్రస్తుతం వేదవతికి 5సంవత్సరాల కుమార్తె కలదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న వేదవతి గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే సెంట్రీ డ్యూటీకి వెళ్లేందుకు 5గంటలకు మరో కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి చూడగా వేదవతి రక్తపుమడుగులో కుర్చీలో పడి ఉండడం చూసి పోలీసు అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం వేదవతి మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. ఇదిలా ఉండగా వేదవతి సెంట్రీ డ్యూటీలో ఉన్న సమయంలో ఎవరితోనూ ఫోన్లో మాట్లాడిన అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. తన భార్యతో నాలుగు గంటలకు ఫోన్లో మాట్లాడగా బిర్యానీ తీసుకురమ్మని చెప్పిందని, చికెన్ తీసుకునేందుకు వెళ్లగా వెంటనే తనకు ఫోన్ వచ్చిందని, మీ భార్య గన్‌తో కాల్చుకుని చనిపోయినట్లు చెప్పారని భర్త దస్తగిరి అంటున్నాడు. వేదవతి మీకు రెండో భార్య అంట కదా ముందు భార్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారని దస్తగిరినే అడగగా అలాంటిదేమీ లేదని మొదటి పెళ్లి విషయంపై దాటవేసే ప్రయత్నంగా మాట్లాడాడు. కుటుంబ సమస్యల కారణంగానే వేదవతి ఆత్మహత్య చేసుకుందా.. లేక ఫోన్లో ఎవరితోనో మాట్లాడి ఆత్మహత్యకు పాల్పడిందా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది.

కాలువ కబ్జా



మోడమీది పల్లె పొలంలో కాలువను ఆక్రమించి చదును చేసిన కబ్జాదారులు

చదును చేసిన స్థలంలో కాలువ ఉన్న దృశ్యం

- రూ.3కోట్ల విలువైన స్థలాన్ని పూడ్చి చదును
- కాలువపై పంచాయతీలో బడా వ్యాపారి కన్ను
- కొత్తపల్లె కేంద్రంగా పెరిగిపోతున్న కబ్జాలు
- హైకోర్టు చర్యలు తీసుకోమన్నా లెక్కలేని అధికారులు
- పట్టించుకోని రెవెన్యూ పంచాయతీ అధికారులు

ప్రొద్దుటూరు, జూన్ 2: ప్రొద్దుటూరులో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా వాటిని దింగమింగే అనకొండలు తయారయ్యాయి. ముఖ్యంగా కొత్తపల్లె పంచాయతీ కేంద్రంగా భూదందాలు పెరిగిపోతున్నాయి. కాలువ స్థలాన్నీ వదలడం లేదు. ప్రొద్దుటూరు పట్టణానికి తూర్పున ఉన్న ఈ పంచాయతీ దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు విల్లాలతో పాటు పారిశ్రామికవాడలు, వ్యాపార కేంద్రాలు వెలుస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో స్థలాల రేట్లు అమాంతంగా పెరిగిపోయాయి. మైదుకూరు రోడ్డుకు ఆనుకుని సెంటు రూ.30 లక్షల వరకు పలుకుతోంది. ఇక్కడే ఉన్న గ్రీల్ ల్యాండ్ సాయిరాజేశ్వరి కాలనీ, టీచర్స్‌కాలనీ ప్రాంతాల్లో సెంటు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పోతోంది. ఇక్కడ ఖాళీగా ఉండే ప్రభుత్వ స్థలాలను ఇప్పటికే పాత వెంచర్లలో కలుపుకుని విక్రయించి కోట్లు కొల్లగొట్టారు. ఆఖరికి ఫారెస్టు ల్యాండు సైతం ఆక్రమించినట్లు చెబుతారు. తాజాగా మోడమీది పల్లె గ్రామపొలంలోని సర్వేనెంబరు 417లో 26 సెంట్ల మేర ఉండే కాలువ స్థలంపై కొత్తపల్లెలో రియల్ ఎస్టేట్ చేసే బడా వ్యాపారి కన్నుపడింది. అంతే.. రాత్రికి రాత్రి ఆ కాలువను వందలాది ట్రాక్టర్ల మట్టి తీసుకొచ్చి ఎక్సకవేటర్లతో పూడ్చి వేశారు. బొంగుబజారు వెనుక గ్రీన్‌ల్యాండు వెళ్లే దారిలో ఉన్న ఈ స్థలం సెంటు రూ.10-12 లక్షల విలువ చేస్తుంది. ఇందులో పంచాయతీకి చెందిన కీలక నేత అభ్యంతరం పెట్టగా ఆయనతో లోపాయికారి ఒప్పందం జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఈ కాలువ పూడ్చివేతకు లక్షలు ఖర్చుచేసిన ఆ పెద్దమనిషి పంచాయతీ రెవెన్యూ అధికారులను కూడా మేనేజ్ చేయగల సమర్థుడు. అందుకే స్థానికులు ఫిర్యాదు చేస్తే విలేజ్ సర్వేయర్లు వచ్చి కేవలం హద్దులకు ఎర్రజెండాలు పాతి వెళ్లిపోయారు. అంత పెద్దకాలువను వందలాది ట్రాక్టర్లు పెట్టి రాత్రీపగలు ఎక్సకవేటర్లతో పూడ్చిందెవరో తెలుసుకుని కనీసం వారికి నోటీసులు కూడా ఇవ్వలేదు. దీన్నిబట్టే అందులో రెవెన్యూ, పంచాయతీ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్లు ప్రచారం సాగుతోంది.

సర్వే సరే.. సంరక్షణ ఏదీ..?

సహజంగా ఉండే ఈ కాలువను రెవెన్యూ, పంచాయతీ అధికారులు కాపాడకపోతే భవిష్యత్తులో ఇక్కడ మురుగునీటి పారుదల వ్యవస్థకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. కొత్తపల్లె పంచాయతీలోని టీచర్స్‌కాలనీలో ఉన్న ఇదే మోడమీది పల్లె సర్వేనెంబరు 411లో 42 సెంట్లు, 412లో 42 సెంట్లు, 413లో 46 సెంట్లు, 414లో 40 సెంట్లు, 416లో 29 సెంట్లు 417లో 26 సెంట్లు చొప్పున.. మొత్తం ఈ కాలువ 2.25 ఎకరాలు ఉంది. ఇందులో చాలా వరకు ఆక్రమణకు గురైంది. గతంలో ఈ కాలువ కబ్జాపై ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. అప్పుడు కూడా సర్వే చేపట్టి కాలువ కబ్జాకు గురయిందని నివేదికలు ఇవ్వడం తప్ప వాటిని సంరక్షించే చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

హైకోర్టు ఆదేశించినా..

కాలువ ఇప్పటికే చాలాచోట్ల పూడ్చివేశారు. చదును చేసి ప్లాట్లలో కలుపుకున్నా ఇంతవరకు పంచాయతీ, రెవెన్యూ అధికారులెవ్వరు చర్యలు తీసుకోలేదు. కాలువ ఆక్రమించి అక్రమనిర్మాణాలు చేపడుతున్నారని ఇటీవలే హైకోర్టులో హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ కరుణాకర్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. దీనికి స్పందించిన హైకోర్టు కాలువ కబ్జాపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలు సైతం లెక్కచేయని కబ్జాదారులు ఈ కాలువలో కొంత భాగం ఎక్కడికక్కడ కబ్జాచేసుకుంటూ వస్తున్నారు. హైకోర్టు చర్యలు తీసుకోమన్నా అధికారుల్లో సైతం కదలికలేదు.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

ఆ కాలువనే బొంగుబజార్ వెనుక నుంచి ప్రారంభమై టీచర్స్ కాలనీ నుంచి వైట్‌హౌస్ మీదుగా జేమ్స్‌పేట వరకు వెళుతుంది. కొత్తపల్లె ఉపకాలువను కబ్జాదారులు పూడ్చివేస్తే పంచాయతీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవ డం లేదు. మళ్లీ అదే కాలువ స్థలంలో రేపు నిర్మాణాలు చేపడితే వాటికి ప్లాన్లు మంజూరు చేసి ఇంటి పన్నులు సైతం విధించగలరు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..


కొత్తపల్లె ఉపకాలువ కాలువ ఆక్రమణకు గురవుతుంటే మరోసారి మా సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఒకసారి సిబ్బందితో సర్వే చేసి హద్దులు గుర్తించాం. ఆ మేరకు కబ్జాకు గురికాకుండా రక్షించుకోవాల్సింది పంచాయతీ అధికారులే.

- విద్యాసాగర్, తహశీల్దార్, ప్రొద్దుటూరు

చేదెక్కిన 'మామిడి'



అరకొరగా దిగుబడి వచ్చిన మామిడి పంట



- గణనీయంగా తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో అరకొర అమ్మకాలు
- నష్టాల బాటలో మామిడి రైతులు
- కొండెక్కిన ధరలు, ఆందోళనలో కొనుగోలు దారులు

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు



మామిడి కోత పూర్తయిన వెంటనే రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపడితే మామిడి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చు. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడి పూత ఆలస్యంగా రావడమే కాక పూత శాతం కూడా తగ్గింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం జూన్‌లో మామిడి చెట్ల కత్తిరింపులు, తోటల్లో దున్నకాలు, చెట్లకు పాదులు తీయడం వంటివి చేసుకోవాలి. సేంద్రియ ఎరువులను వినియోగించడమే కాకుండా నీటి తడులను కూడా సకాలంలో అందిస్తే పూత రాలిపోకుండా తెగుళ్ల ఆశించకుండా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మామిడి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీ సౌకర్యాలను కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-పి.రవిచంద్ర, అన్నమయ్య జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

రాయచోటిటౌన్, జూన్ 2: పండ్లలో రారాజుగా పేరొందిన మామిడి పండు చేదెక్కింది. అరకొర వర్షాలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా పూత రావడం, అంతలోనే తెగుళ్ల సోకడం రైతులను కలవరపాటుకు గురిచేసింది. వేసిన మందులు నాసిరకం కావడం, ఎండల తీవ్రతకు పిందె రాలిపోవడంతో దిగుబడి శాతం గణనీయంగా తగ్గింది. ఫలితంగా మామిడి రైతుకు ఈ ఏడాది కన్నీళ్లే మిగులుతున్నాయి. పంట దిగుబడి సరిగాలేక పోవడంతో మామిడి పండు మార్కెట్ చేరకపోయింది. తక్కువ మొత్తం పండ్లు అందుబాటులోకి రావడంతో ధరలు ఆకాశాన్ని చేరుకోవడం తో మామిడి ప్రియులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకెళితే....

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఎక్కువ శాతం మంది రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతన్నలు మామిడి సాగులో ఎదురయ్యే కష్టనష్టాలకు ఓర్చుకుని ఏళ్ల తరబడి తోటలను సాగు చేస్తున్నా మామిడి పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. వాతావరణంలో మార్పులు, అకాల వర్షాలు, వర్షా భావ పరిస్థితులు మామిడిపై పడడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో కొన్ని చోట్ల ఎండ వేడిమికి కాయలు రాలిపోగా మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలిపోయాయి. పండ్లలో రారాజుగా పిలవబడే మామిడి కాయలు ఇటు తోటల్లో గానీ, అటు మార్కెట్‌లో గానీ పూర్తి స్థాయిలో కనిపించడం లేదు. మార్కెట్‌లో అరకొరగా దర్శనమిస్తున్న మామిడి కాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఫలితంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు మామిడి కాయలను కొనుగోలు చేయాలంటేనే జంకుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి కిలో ధర రూ.80 నుంచి రూ.180లు పలుకుతుండడంతో ఈ ఏడాది మామి డి దిగుబడి గణనీయంగా తగ్గడంతోనే ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 35,867 హెక్టార్లలో సాగు

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 35,867 హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఎంతో ఆశగా మామిడి పండ్ల సాగు చేస్తున్న రైతన్నలకు గిట్టుబాటు ధరలు లేక, ఆశించిన స్థాయిలో దిగుబడు లు రాక నాలుగేళ్లగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులకు గతేడాది కంటే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులను అనుకూలించకపోవడంతో నష్టాలు తప్పడం లేదని అటు రైతులు ఇటు వ్యాపారులు వివరిస్తున్నారు. అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లె, పీలేరు తదితర ప్రాంతాల రైతులు, వ్యాపారులు కూడా మామిడి పంటను ముంబై, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమ తి చేస్తారు. గతంలో మామిడి తోటల్లో పూతను చూసి వ్యాపారులు పంటను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం నేరుగా తోటల వద్దకు వెళ్లి కాయల దిగుబడులను చూసి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వ్యాపారులు మామిడి కొనుగోళ్లపై ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది అనుకున్నంత స్థాయి లో పంట దిగుబడి రాక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మార్కెట్‌లో అరకొరగా పండ్లు...

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఈఏడాది మామిడి పంట దిగుబడి గణనీయంగా తగ్గడంతో మార్కెట్‌లో మామిడి ధరలు ఎండలతో పోటీపడుతున్నా యి. సాధారణంగా ఏటా మార్చి చివరి వారం మే చివరి వరకు మార్కెట్‌లో ఎక్కడ చూసినా మామి డి పండ్లు దర్శనమిచ్చేవి. ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గడంతో మార్కెట్‌లో మా మిడి పండ్లు అరకొరగా దర్శనమిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో పూత రాకపోవడం, అక్కడక్కడా అరకొరగా పూత వచ్చినా అది కూడా అకాల వర్షాలకు, తీవ్ర వర్షాభావ పరిస్థితులకు రాలిపోవడంతో మామిడి దిగుబడిపై ప్రభావం పడింది. శీతాకాలం లో మామిడిచెట్లకు దట్టంగా పూత వచ్చినా వాతావరణంలో మార్పుల కారణంగా నిలబడక పోవ డం, నాసిరకం మందుల ప్రభావంతో పూత నిలబడలేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో అరకొర మామిడిపండ్లు కనిపించినా కిలో రూ.80 నుంచి రూ.180 వరకు పలుకుతున్నాయి. దీంతో సామాన్యులు మామిడి పండ్లు కొని తినే పరిస్థితులు లేకుండా పోయాయి.

సాగుకు అధిక ఖర్చులు వస్తున్నాయి



మామిడి సాగుకు పెద్ద మొత్తంలో ఖర్చులు వస్తున్నాయి. మామిడి తోటలు దుక్కి దున్నకం, పాదులు తీయడం, కంచె వేయడం, చెట్లకు ఎరువులు, మందులు, నీరు కట్టడం వంటివి చాలా అవసరం. ఇంత కష్టపడినా నాలుగేళ్లగా పంట సరిగ్గా రావడం లేదు. పెరిగిన ధరలతో మామిడి సాగులో పెట్టుబడి ఎక్కువవుతున్నా ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదు. ప్రభుత్వాలు పరిహారం అందించి ఆదుకోవాలి.

- శ్రీనివాసులరెడ్డి, రైతు, మాధవరం నాగిరెడ్డిగారిపల్లె

మామిడి రైతులను ఆదుకోవాలి



జిల్లాలో మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్న రైతులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతులకు కూలీలు ఖర్చులు అధికమవుతున్నాయి. మామిడి పంట కూడా దిగుబడి కూడా రోజు రోజుకూ తగ్గుతోంది. మామిడి చెట్లు ఉన్న ప్రతి రైతుకూ ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. రైల్వేకోడూరు, రాయచోటి ప్రాం తాల్లో మామిడి ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలవాలి.

- సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి

వెలవెలబోతున్న మామిడి మండీలు

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రైల్వేకోడూరు 3,687, టి.సుండుపల్లె 3,036, చిన్నమండెం 2,500, లక్కిరెడ్డిపల్లె 2,400, వీరబల్లి 2,105, కేవీపల్లె 1,850, చిట్వేల్ 1,760, గుర్రంకొండ 1,658, రామాపురం 1,433, పీలేరు 1,400, కలకడ 1,378, పెనగలూరు 1,352, సంబేపల్లె 1,230, వాయల్పాడు 1,150, కలికి రి 1,090, గాలివీడు 9,020, రాయచోటి 890, నిమ్మనపల్లె 820, పెద్దమండ్యెం 784, నందలూరు 712, ఓబులవారిపల్లె 650, రామసముద్రం 600, మదనపల్లె 690, రాజంపేట 374, కురబలకోట 300, తంబళ్లపల్లె 300, బి. కొత్తకోట 286, మొలకలచెరువు 250, పీటీఎం 217, పుల్లంపేట 196 హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేశారు. ఈఏడా ది దిగుబడి గణనీయంగా తగ్గడంతో వాటి విక్రయం కోసం ఏర్పాటు చేసిన మండీలు వెలవెలబోతున్నాయి. జిల్లాలో మామిడి కాయలను విక్రయించేందుకు వ్యాపారులు పలు మండీలను ఏర్పాటు చేశారు. రైతులు, వ్యాపారులు మామిడి కాయలను ఈ మండీలకు చేర్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం మామిడి దిగుబడి గణనీయంగా తగ్గడంతో మండీ లకు మామిడి కాయలు రాకపోవడంతో మామిడి మండీలు వెలవెలబోతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో కొందరు వ్యాపారులు రైతులకు అనుకూలంగా ఆయా మండల కేంద్రాల్లోనే మామిడి షెడ్లను ఏర్పాటు చేస్తుంటారు. ఆయా మండలాల్లోని రైతులు అక్కడికే కాయలను తరలించి విక్రయిస్తుంటా రు. ప్రస్తుతం కాయలు పూర్తి స్థాయిలో రాకపోవడంతో ఆ షెడ్లు కూడా ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

వీరబల్లి బేనీషాకు దేశ, విదేశాల్లో భలే గిరాకీ...!

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి సమీపంలోని వీరబల్లి మండలంలో మామిడి తోటల్లో అత్యధికంగా లభించే వీరబల్లి బేనీషా అంటే మహాఇష్టం. ఈ వీరబల్లి బేనీషా చాలా రుచిగా ఉంటుం ది. ఈ బేనీషాను కొనుగోలు చేయడానికి ఢిల్లీ, ముంబై, కలకత్తా ప్రాంత వ్యాపారులు వస్తుంటా రు. ఈ వీరబల్లి బేనీషాను మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. అందుకే ఈ బేనీషాకు అంత పేరు వచ్చిందని రైతులు, వ్యాపారు లు చెబుతుంటారు. వీరబల్లి మండలంలో మామి డి తోటలు అధికంగా ఉన్నాయి. అందుకోసమే మామిడి ప్రియులు ఎక్కువగా ఈ వీరబల్లి బేనీషాను ఇష్టపడుతుంటారు.



మండీలకు చేరిన మామిడి కాయలు

వైభవంగా జాంబవంతుని తిరుణాల

- కలశాలతో ఊరేగింపు
- వెండి కవచంతో స్వామి దర్శనం

రైల్వేకోడూరు, జూన్ 2: పట్టణంలోని అంకమ్మనగర్‌లో వెలసి ఉన్న జాంబవంతస్వామి తిరుణాల ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయాన్నే ఆలయం నుంచి భక్తులు 108 కలశాలతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కలశాలలో ఉన్న నీటితో స్వామికి అభిషేకం చేశారు. స్వామి వారికి మొదట పంచామృతాభిషేకం చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం పోతురాజు అమరేంద్ర కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



వెండికవచంతో దర్శనమిస్తున్న స్వామి



కలశాలతో పురవీధుల్లో ఊరేగింపు

పశువులను రైతులే మేపాలి

- వదిలేయడంతో ప్రమాదాల్లో పశువులు మృతి
- లక్షలాది రూపాయలు నష్టపోతున్న రైతులు
- ఇన్సూరెన్స్ చేస్తేనే బీమా : అధికారులు

బి.కోడూరు, జూన్ 2: పశువులను రైతులే స్వయంగా మేపాల్సి ఉంటుంది. లేనిపక్షంలో పశువులు పలు రకాల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఫలితంగా లక్షలాది రూపాయలు నష్టపోయే అవకాశం ఉంది. పశువులకు ఇన్సూరెన్స్ చేయిస్తేనే బీమా అందే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు.

సాధారణంగా రైతులు పశువులను ఉదయాన్నే మేతకు వదిలి వేస్తుండడంతో అవి ఊర్లోకో, లేక అడవికో వెళ్లి మేతమేసి సాయంత్రానికి ఇంటికి వచ్చేవి. అయితే ఒక్కో పర్యాయం పశువులు వివిధ రకాల ప్రమాదాలకు గురవుతూ రైతులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతుంటోంది. ఇటీవల మండలంలో టమటంవారిపల్లెలో నలుగురు రైతుల ఏడు పశువులను మేత కోసం వదిలి వేయడంతో అవిపొలాల్లో మేతకు వెళ్లి విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో దాని విలువ రూ.80వేల నుంచి లక్ష విలువ చేసే పశువులు. పెదుళ్లపల్లె వాసులు ఇద్దరు రైతుల పశువులు బద్వేలు, పోరుమామిళ్ల రోడ్డు దాటి కొండకు మేతకు వెళుతుండడంతో రోడ్డు ప్రమాదంలో నాలుగు మృతి చెందాయి. మాధవరాయనిపల్లె గ్రామానికి చెందిన 20 మంది రైతుల పశువులను ఉదయాన్నే మేత కోసం విడిచి తోలడంతో అవి బద్వేలు, పోరుమామిళ్ల రహదారి దాటుతుండగా ప్రమాదాలకు గురై దాదాపు 30 పశువులు మృతి చెందాయి. తంగేడుపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు తన మూడు పశువులను వదిలివేయడంతో అవి విద్యుత్ తీగలు తగిలి ప్రమాదానికి గురయ్యాయి. ఈ సంఘటనలు నిత్యం జరుగుతున్నా రైతులు పశువులను మేతకు వదిలేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో పశువులన్న రైతులు తమ పశువులను తోలుకుని వెళ్లి మేపి ఇంటికి తోలుకుని వచ్చేవారు. ఇప్పుడు పశువులను మేతకు వదిలివేయడం, అవి రైతుల పొలాల్లో ఏ పైరు ఉన్నా దానిని మేయడం కొందరు రైతులు తీవ్రంగా నష్టపోవడం దాంతో ఎన్నో ఘర్షణలు కూడా జరిగాయి. ఒక్కో రైతు ఎకరా పైరు సాగు చేయాలంటే రూ.30 వేలు మొదలు రూ. 40వేలు పెట్టుబడి వస్తుంది. తెలిసీ తెలియని పశువుల రైతులు వాటిని వదలడం ఆ రైతు వేసిన పైరు తినడంతో రైతుకు చాలా నష్టం జరుగుతున్నాయి. లక్షలకు లక్షలు వెచ్చించి పశువులను కొనుగోలు చేసి తెచ్చుకుని జాగ్రత్తగా కాపాడుకోవలసిన బాధ్యత ఉంది. అలా కాకుండా ఆ పశువులను వదిలేయడం అవి రకరకాల ప్రమాదాల బారిన పడి రైతులు ఎంతగానో నష్టపోతున్నారు. ప్రమాదాల్లో నష్టపోయిన రైతుల పశువులకు సక్రమంగా ఇన్సూరెన్స్ కూడా చేసి ఉండరు. మండలంలో ఒకరో ఇద్దరో పశువులకు ఇన్సూరెన్స్ చేస్తున్నారే తప్ప వాటిపైన అవగాహన లోపమో, లేక తెలియకపోవడమో తెలియదు కానీ పశువులకు అందరూ ఇన్సూరెన్స్ చేయడంలేదు. ఇప్పటికైనా పశువుల రైతులు తమ పశువులను జాగ్రత్తగా తోలుకుని వెళ్లి మేపి ఇంటికి తోలుకుని అలా కాకుండా వదిలేస్తే పంట పొలాలు వేసిన రైతులు ఆ పశువులతో నష్టపోవడమే కాక వారు పడే ఆవేదన అంతా ఇంతా కాదు. ఈ విషయమై పశువైద్యాధికారి వెంకటసుబ్బయ్యను అడగ్గా, పశువులను రైతులు మేతకు వదిలేయడం మంచి పద్ధతి కాదు, ప్రమాదాలకు గురైనప్పుడు వాటికి ఇన్సూరెన్స్ చేసి ఉంటే బీమా తప్పకుండా వస్తుందని ఇప్పటికైనా పశువు రైతులు తమ పశువులకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఆయన తెలిపారు.



టమటంవారిపల్లెలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన పశువుల కళేబరాలు



తంగేడుపల్లెలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన పశువులు

రైతులు పశువులను మేతకు వదిలేయడం మంచిది కాదు



పశువులను మేత కోసం రైతులు వదిలేసి చాలా తప్పు చేస్తున్నారని తమ పశువులను వారే కాసుకోవాలి. మేతకు వదిలేయడంతో రైతులు వేసిన పంటలను నాశనం చేస్తూ రైతుకు నష్టం చేకూరుస్తున్నాయి. పశువులను వదిలేయకూడదు.

- రైతు, దుగ్గిరెడ్డి, ఐత్రంపేట

ప్రమాదాల్లో పశువులు చనిపోతున్నాయి



తెలిసీ తెలియని రైతులు పశువులను మేత కోసం వదిలేస్తుండడంతో అవి రోడ్డు దాటుతూ, పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి చాలా పశువులు చనిపోతున్నాయి. రైతులు జాగ్రత్తగా తమ పశువులను కాసుకుంటే మంచిది.

- రమణారెడ్డి రైతు, మాధవరాయునిపల్లె

జిల్లాలో టీబీ మందుల కొరత లేదు

రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్ వెల్లడి

కడప(కలెక్టరేట్) జూన్ 2: వైఎస్సార్ కడప జిల్లాలో ఎక్కడా టీబీ మందుల కొరత లేదని టీబీ జాయింట్ డైరెక్టర్ టి.రమేష్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రొద్దుటూరు ఆస్పత్రుల్లో అవసరమైన టీబీ మందులు లేవని జరుగుతున్న ప్రచారం నిజం కాదన్నారు. అవసరమైన స్థాయిలో టీబీ నివారణ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. టీబీ రోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని. బయట ఎవరూ కొనుగోలు చేయమని వైద్యులు సూచించ లేదని ఆయన ఆ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నీటికుంటలో పిడుగు పడి చేపలు మృతి

- రైతుకు మూడు లక్షల రూపాయలు నష్టం



చేపల చెరువు - ఇన్‌సెట్‌లో చనిపోయిన చేపలు

నిమ్మనపల్లి, జూన్ 2: కొండయ్యగారిపల్లి పంచాయితీ వెంకోజిగారిపల్లి రైతు సుధాకర్‌రావుకు చెందిన నీటికుంటలో శనివారం రాత్రి పిడుగు పడి టన్ను చేపలు మృతి చెందినట్లు రైతు తెలిపాడు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల కిందట సొంత నిధులతో 20కుంటల భూమిలో నీటి కుంటను ఏర్పాటు చేసి అందులో కొరమీను చేప పిల్లలను వదిలినట్లు తెలిపాడు. అయితే కొరమీను అమ్ముకునేందుకు దాదాపు 6నెలల కాలవ్యవధి వుండగా ప్రస్తుతం నెల రోజుల్లో చేపలను అమ్ముకొనే సమయంలో పిడుగు పడి దాదాపు 3లక్షల విలువైన టన్ను చేపలు చనిపోయినట్లు తెలిపారు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో చేపలను బయటకు తీసి పడేసినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు చనిపోయిన చేపలు నీటిలో తేలు తుండడంతో ఇంకా ఎక్కువగా నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఎంతో ఆశగా చేపల పెంపకాన్ని ప్రారంభించానని పిడుగు పడి చేపలు చనిపోయినట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ అత్యంత కీలకం

అప్రమత్తతతో వ్యవహరించాలి : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 2: జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ అత్యంత కీలకంగా మారిందని... ప్రతి ఏజంటు అప్రమత్తంగా వ్యవహరించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం కడప నగరం డీఎస్ఆర్ కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జోన్5 విభాగానికి సంబంధించి ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి ఒక్క ఏజంటు ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఆచితూచి వ్యవహరించాలన్నారు. ప్రతీది క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అలాగే లెక్కింపు ప్రక్రియలోని నిబంధనలు వారికి తెలిపారు. అనంతరం రిమ్స్ సమీపంలోని అబ్దుల్‌కలాం ఉర్దూ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డితో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ జోన్-5 ఇన్‌చార్జ్ వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, టీడీపీ నాయకులు బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బండారు మనోహర్‌నాయుడు, సీఎస్ మూర్తి, కర్నాటి అమర్‌నాదరెడ్డిలు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రానికి వెళుతున్న టీడీపీ ప్రతినిధులు

ఏఎస్ఐ కొడుకు ఆత్మహత్య

కడప (క్రైం), జూన్ 2: పెండ్లిమర్రి ఏఎస్ఐ పుల్లయ్య కుమారుడు తూపల్లి సాయిక్రిష్ణ (28) ఆదివారం ప్రకాశ్‌నగర్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌకు ఎస్ఐ రఫి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. సాయిక్రిష్ణ ప్రైవేటుగా చదువుతూ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆయన తండ్రి పెండ్లిమర్రిలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. పుల్లయ్య అనారోగ్యం వల్ల రెండు రోజుల కిందట కేరళ వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కొడుకు ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



వాల్మీకిపురం, జూన్ 2: వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరు వాసి వెంకటేశ్వర్లు, రుక్మిణి దంపతుల కుమార్తె చౌడేశ్వరి(29) కలకడ మండలం కదిరాయ చెరువుకు చెందిన మంజునాథతో తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. మంజునాథ నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లెలో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తూ వాల్మీకిపురం బజారు వీధిలో భార్య చౌడేశ్వరితో కలిసి కాపురముంటున్నాడు. శనివారం రాత్రి ఏం జరిగిందో తెలియదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చౌడేశ్వరి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వేధింపులతోనే తమ కుమార్తెను కడతేర్చినట్లు మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

శిల్పారామంలో అలరించిన ఆటాపాట

కడప (కల్చరల్), జూన్ 2: చిన్నారుల ఆటా పాటాతో శిల్పారామం హోరెత్తింది. ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా నగర రిమ్స్ సమీపంలోని శిల్పారామం ప్రేక్షకులతో నిండిపోయింది. అక్కడి సాంస్కృతిక కళావేదికపై మిస్సా మూవీ ఆధ్వర్యంలో సంబంధిత పరిపాలనాధికారి ఎం. మునిరాజు పర్యవేక్షణలో బద్వేల్ నగరానికి చెందిన అనూష్‌బాబు అకాడమీ బృందం చిన్నారులచే పల్లె జానపద, శాస్త్రీయ, సినీ గీతాలకు వారు వేసిన స్టెప్పులకు ప్రేక్షకుల కరతాళధ్వనులతో ఆ ప్రాంతం మార్మోగింది. ఇందులో ప్రధానంగా సోక్‌లాడి చిట్టెమ్మి, పాలోయ్ పాలోయమ్మ, గంపకింద కోటిపెట్టె, గోంగూర తోటకాడ తదితర పాటలకు చిన్నారుల స్టెప్స్ అదరహో అనిపించాయి.



కడప: శిల్పారామంలో స్టెప్స్ వేస్తున్న చిన్నారులు


పులివెందుల: శిల్పారామంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

● ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పులివెందుల టౌన్, జూన్ 2 : పట్టణంలోని ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్, వారంత్ర సాంస్కృత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆంధ్ర స్పైస్, ఫ్యామిలీ రెస్టారెంట్, పులివెందుల వారి సౌజన్యంతో స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇనిస్టిట్యూట్ వారి నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూలు, పులివెందుల డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గణాధికాయా గణదైవతాయ, గనాదక్షాయ ధీమహి అంటూ సాగే ఈ పాటతో మొదలై ఆ కుర్చీని మడత పెట్టి, ఎందుకో పిచ్చిపిచ్చిగా నచ్చావే, సారంగ దరియా తదితర పాటలకు నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నృత్య శిక్షకుడు చిట్టి, వినోద్, స్కూలు కరస్పాండెంట్ కుమార్, పరిపాలన అధికారి సుధాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు

సీకేదిన్నె, జూన్ 2: చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వారి కోర్కెలు నెరవేరడంతో అమ్మవారికి కానుకలు సమర్పించి అమ్మవారి సన్నిదిలో బంధుమిత్రులతో కలిసి విందు బోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు. సమీపంలోని వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి, శివాలయం, అక్కదేవతల ఆలయాల్లో సైతం భక్తులు పూజలు నిర్వహించారు.

వీఎన్‌పల్లెలో 144 సెక్షన్ అమలు

వీరపునాయునిపల్లె, జూన్ 2 : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్‌లో భాగంగా వీరపునాయునిపల్లెలో మంగళవారం 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ రోజున మండల కేంద్రంలో కానీ పల్లెల్లో కానీ ఎలాంటి దుకాణాలు తెరవకూడదని ఒక వేళ తెరిస్తే దుకాణాలు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

గుంపులుగా ఉంటే చర్యలు తప్పవు: సీఐ

చెన్నూరు, జూన్ 2:స్వార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4న జరగనున్న దృష్ట్యా ప్రజలు గుంపులుగా ఉండడం, చర్చలు పెట్టుకోవడం, అదే పనిగా రాత్రివేళల్లో వీధుల్లో తిరగడంలాంటివి చేయకూడదని, నిబంధనలు తప్పిన వారు ఎంతటివారైనా సరే చర్యలు తప్పవని సీఐ పార్థసారథి హెచ్చరించారు. ఆదివారం చెన్నూరు పాతబస్టాండులో ఆయన మైక్ ద్వారా తగు జాగ్రత్తలు తెలియజేశారు. మాట్లాడుతూ ఎన్నికల విషయమై ఎటువంటి విబేధాలకు పోవద్దని పేర్కొన్నారు. పైగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎన్నికలపై సోమ, మంగళ, బుధవారాల్లో ఎలాంటి రచ్చలు, గొడవలకు పాల్పడవద్దని, 144 సెక్షన్ అమలులో ఉందని చెప్పడం జరిగింది. ముఖ్యంగా సున్నితమైన గ్రామ పంచాయతీల్లో సమస్యలకు దిగవద్దని మండలమంతా తిరుగుతూ సీఐ వాచ్చరించారు. ప్రశాంతమైన పద్ధతులు అవలంభించుకోవాలని ఏఒక్క చోట కూడా ఐదారు మంది కలిసి ఉండకూడదని, షాపులు కూడా సోమ, మంగళవారాల్లో మూసి ఉండాలని, ఏ చిన్న సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు.


చెన్నూరులో ప్రజలనుద్దేశించి హెచ్చరిస్తున్న పోలీసులు

హైవే వంతెనపై లైట్లు ఏర్పాటు చేయరా..?

● ప్రమాదాలు జరిగితే పట్టించుకోరా

చెన్నూరు, జూన్ 2: చెన్నూరు- ఖాజీపేట మధ్య పెన్నానదిపై రాకపోకల కోసం ఏర్పాటు చేసిన హైవే వంతెనపై ఇప్పటి వరకు లైట్లు ఏర్పాటుచేయలేదు. దీంతో ఆ దారిన వెళ్లే వాహనచోదకులు ప్రజలు, ప్రమాదాలు జరిగితే తప్ప పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. పెన్నానదిపై రాకపోకల కోసంగా రెండు హైలెవల్ వంతెనలు ఏర్పాటు చేశారు. ఒక వైపు చెన్నూరు నుంచి ఖాజీపేట వైపు వెళ్లే వంతెనపై మాత్రమే లైట్లు ఏర్పాటుచేయగా ఖాజీపేట నుంచి చెన్నూరు వైపునకు వచ్చే వంతెనపై మాత్రం ఇప్పటివరకు లైట్ల ఊసేలేదు. గతంలో ఇదే వంతెనపై రెండు సార్లు పెద్ద ప్రమాదాలు జరగ్గా అప్పట్లో ఆరుగురు మరణించారు. అలాగే ఇటీవల మరో రెండు ప్రమాదాలు జరగగా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు, మరో కుటుంబానికి చెందిన మహిళ మృతిచెందారు. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. కాబట్టి లైట్లు ఏర్పాటు చేస్తే రాత్రివేళ వంతెనపై ప్రమాదాలు జరిగే వీలుండదని, హైవే అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కొండపేట వంతెనపై నాలుగు సోలార్ లైట్లు ఏర్పాటు చేయగా ఆ వంతెనపై రెండు లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి, మరో రెండు అలంకార ప్రా యంగా ఉన్నాయి. ఈ వంతెనకు ఇరువైపులా చెన్నూ రు- కొండపేట పెద్ద పంచాయితీలు ఉన్నా ప్రయోజనం లేదు. పైగా ఇదే వంతనపై చీకటి పడిన తర్వాత ప్రమాదాలు జరిగి కొండపేటకు చెందిన సుబ్బరాయుడు, అలాగే చెన్నూరుకు చెందిన మరోవ్యక్తి తీవ్ర గాయాలపాల య్యాడు. సర్పంచ్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరు తున్నారు.



హైవే వంతెనపై లైట్లు ఏర్పాటు చేయని దృశ్యం... కొండపేట వంతెనపై గాండాంధకారం

పంట నష్టాన్ని అంచనా వేయాలి

సీకేదిన్నె, జూన్ 2:రైతులు తీవ్ర వర్షాభావం, ఎండల ప్ర భావంతో నష్టపోయిన అరటి, చీనీ, ఆకుతోటలను రైతుల పంట నష్టాన్ని ఉద్యాన శాఖ ధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చింతకొమ్మదిన్నె మండలం కొలుముల పల్లె పంచాయతీలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు, విపరీతమైన ఎండలు ఎక్కువగా ఉండడంతో బోరుబావులు అడుగంటి రైతులు వేసిన పంటలు ఎండిపోవడం జరిగిందన్నారు. కోత దశలో రైతులు నష్టపోవడంతో దాదాపు ఎకరాకు రూ.లక్షకుపైగా చేసిన ఖర్చు వృథా అయిపోయిందని, కౌలు రైతుల పరిస్థితి మరీ దా రుణమన్నారు. ఇప్పటికైనా ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులకు న్యాయం చేయని పక్షంలో పంటలు నష్టపోయిన రైతుల ను కలుపుకుని ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, కార్యదర్శి దస్తగిరిరెడ్డి, మండల నాయకులు రంగారెడ్డి, చిన్నసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఎండిపోయిన అరటితోటను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందించాలి: ఏఐఎస్ఎఫ్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 2: ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గు జ్జుల వలరాజు తెలిపారు. ఆదివారం కడప నగరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు జిల్లాలో పూర్తిస్థాయిలో ఇంకా అందలేదని, ఎమ్మార్సీ కేంద్రాలకు స్కూటు పాయింటు వద్దకు చేరవేయాలని కోరారు. జిల్లాలో 3వేల పాఠశాలలు దాదాపుగా ఉన్నాయని, అందులో నాడు-నేడు పేరుతో పనుల్లో జాప్యం ఉన్నా పాఠశాలలు ఇంకా ఉన్నాయని తెలిపారు. దీనిపై డీఈఓ చొరవ తీసుకుని వెం టనే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, శివశంకర్, తేజ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వలరాజు

పెన్షనర్ల డిమాండ్లను కొత్త ప్రభుత్వమైనా పరిష్కరించాలి

కడప (మారుతీనగర్), జూన్2: పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను కొత్త ప్రభుత్వమైనా పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంబారపు అహరోన్ కోరారు. ఆదివారం గుంతబజార్‌లోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 12వ పీఆర్‌సీని సత్వరమే అమలు చేయాలని, ఆలస్యం చేస్తే 30 శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు. ఉద్యోగులు రిటైర్‌మెంట్ అయిన రోజునే వారి పెన్షన్ రాయితీని వెంటనే చెల్లించాలన్నారు. ఆ లెక్కన ప్రతినెలా 1వ తేదీనే వారి పెన్షన్‌ను వారి వారి ఖాతాలలో జమ చేయాలన్నారు. 11వ పీఆర్‌సీలోని 21 నెలల బకాయిలను(2021 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబరు వరకు) చెల్లించాలన్నారు. అంతేకాకుండా ఇప్పటికే రావాల్సిన బకాయిలు ఒక్కొక్కరికి 192 నెలలవి వెంటనే చెల్లించాలన్నారు. ప్రధానంగా 12 శాతానికి తగ్గించిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటమామ్ ఆఫ్ పెన్షన్‌ను 15 శాతానికి, అలాగే 10శాతంగా ఉన్న దాన్ని 7 శాతానికి తగ్గించిన వాటిని పునరుద్ధరించాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల జీపీఎఫ్, ఏపీజీఎల్-1, ఈఎల్ గ్రాడ్యుటీలను చెల్లించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, కార్పొరేట్ ఆసుపత్రులలో ఈహెచ్ఎస్ ద్వారా అనుమంచాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అహరోన్

'ఖాతాదారుల సేవలో ముందుంటాం'

కడప (మారుతీనగర్), జూన్ 2:ఖాతాదారుల సేవలో ముందుంటాం అని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ సత్యప్రకాష్ సింగ్ స్పష్టం చే శారు. బ్యాంక్ 19వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక మరియాపురం సమీపంలో గల కడప ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక వేడుక నిర్వహించి బ్యాంక్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ రాష్ట్రంలోని 10 జిల్లాలలో 9 ప్రాంతీయ కార్యాలయాలుగా బ్యాంక్ సేవలు 551 శాఖలుగా విస్తరించిందని, 2024 మార్చి 31 నాటికి రూ.46345 కోట్ల వ్యాపారం చేశామన్నారు. ముఖ్యంగా రైతులు, స్వయం సహాయక బృందాలు, సమాజంలోని ఇతర అణగారిన వర్గాలకు ఆర్థిక సాయం అందించడంలో సైతం ముందుంటామన్నారు. ఇప్పటికే రూ;4592 కోట్ల నికర విలువతో రూ.802 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందన్నారు. సమావేశంలో బ్యాంక్ జనరల్ మేనేజర్లు పడ్గేట్వార్, ఆర్.గిరి, సంజీవప్పరంగప్పబేగర్, రాజేంద్రన్, రంజిత్‌కుమార్, ఇతర బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యప్రకాష్ సింగ్

'ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న అధికారులు'


మాట్లాడుతున్న అంకన్న

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 2: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారులు వత్తాసు పలుకుతున్నారని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న ఆరోపించారు. ఆదివారం కడప నగరం పీడీఎస్‌యు ప్రాంతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలు పాఠశాలలు ప్రారంబం కాక ముందే అడ్మిషన్లు కొనసాగిస్తున్నారని తెలిపారు. అడ్మిషన్‌కు వచ్చేవిద్యార్థుల చేత నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్టు నిర్వహిస్తున్నారని కేవలం నర్సరీకే 30వేల నుండి 40వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నరన్నారు. దీనిపై ఇప్పటికైనా జిల్లావిద్యాశాఖాధికారులు స్పందించి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్ ఎతేజ, మనోజ్, సాయిసందీప్, ఖాదర్‌బాషాపాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

జమ్మలమడుగు, జూన్ 2: జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట వీధిలో సిరి నిరాశ్రయుల వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్ ప్యాకెట్లు ముద్దనూరు ఏవో మారెడ్డి కృష్ణారెడ్డి అందజేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ తన కూతురు దివ్య జన్మదినం పురస్కరించుకుని అనాథ వృద్ధులకు మధ్యాహ్నం భోజనంతోపాటు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మారెడ్డి రాధ, కుమారుడు నిహాల్‌రెడ్డి, వృద్ధులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయం

కమలాపురం రూరల్, జూన్ 2 : శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల ధ్యేయమని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ రామక్రిష్ణరెడ్డి ఆక్టోపస్ సీఐ నాయక్‌లు తెలిపారు. ఆదివారం కమలాపురం పట్టణంలో 4న జరగనున్న కౌంటింగ్ సందర్భంగా అవాంచనీయసంఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహణ కల్పిస్తూ పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3న సాయంత్రం నుంచి కమలాపురం పట్టణంలో కర్ఫ్యూ అమలులో ఉంటుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. పట్టణంలో దుకాణాలు తెరవద్దని, అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ఎవరి కీ అనుమతి లేదన్నారు. అందరూ సహకరించాల న్నారు. కౌంటింగ్ తరువాత ర్యాలీలు, సభలు, బహిరంగసభలు, సమావేశాలు, విజయోత్సవాలు నిర్వహించరాదన్నారు. పెద్దఎత్తున టపాసులు పేల్చరాదన్నారు. అలా చేస్తే ఆటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కవ్వింపు చర్యలకు, ఘర్షణ వాతావరణం సృష్టించరాదన్నారు. అలా చేస్తే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణ చేపడతామన్నారు. వారికి పాస్‌పోర్టు కూడా రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు. కావున యువత ఆయా అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రుషికేశవరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

జమ్మలమడుగు, జూన్ 2: ఈనెల 4వ తేదీ కడపలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని జమ్మలమడుగులో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి పోలీసు అధికారులు పర్యవేక్షణలో పోలీసు సిబ్బందిని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు జమ్మలమడుగులో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది. పోలింగ్‌రోజు జమ్మలమడుగు పట్టణంలో 116, 117 పోలింగ్ బూత్‌ల వద్ద గొడవ జరగడంతో పోలీసు అధికారులు భద్రత పెంచారు. ఆరోజు నుంచి జమ్మలమడుగు పట్టణంలో, గ్రామాల్లో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. 144 సెక్షన్ అమలుతోపాటు జూన్ 4వ తేదీ కఠినమైన కర్ఫ్యూ అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అయితే జూన్ 3వ తేదీ సాయంత్రం నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులకు సంబంధించి చర్యలు తీసుకున్నారు. అయితే బ్రాందీషాపుల వారు బయట అధిక ధరలకు విక్రయించకుండా పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే జమ్మలమడుగు పట్టణంలోకి వాహనాల ప్రవేశం లేకుండా గ్రామ శివార్లలో పోలీసు పికెట్‌ను 3వ తేదీ సోమవారం నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం ప్రొబేషనరి డీఎస్పీ శ్రీకాంత్, వారి సిబ్బంది పట్టణంలో పర్యవేక్షించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు పట్టణంలోని అన్ని ప్రాంతాలు ప్రత్యేక నిఘాతోపాటు పరిశీలించి లాడ్జీలను సైతం తనిఖీ చేయడం జరుగుతుందని అధికారులు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఏది ఏమైనా ఆదివారం సాయంత్రం నుంచి పట్టణంలో పోలీసు బలగాలు పికెట్ ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు దుకాణాలన్నీ మూసివేయాలని ప్రత్యేకంగా టీ దుకాణాలు మూసివేయాలని చెప్పినట్లుగా తెలిసింది. ఎక్కడైనా గుంపులుగా ఉండరాదని హెచ్చరించారు.



200 మందికి నోటీసులు

ఎర్రగుంట్ల,జూన్ 2:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎర్రగుంట్ల అర్బన్ పరిధిలో 200మందికి నోటీసులు ఇచ్చినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. అలాగే 45మందిరౌడీషటర్స్‌ను గుర్తించామన్నారు. అలాగే 34మంది హౌస్‌అరెస్టు, స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టిపోవాలన్న నిబంధనలు కూడా అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఘర్షణ జరిగిన పెద్దనపాడు గ్రామంలో నిరంతర పికెటింగ్‌ను కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు. అలాగే నిరంతర గస్తీ తిరిగే నాలుగు రకాల ఫోర్స్ కూడా పనిచేస్తోందన్నారు. కౌంటింగ్, అనంతరం ఘర్షణ వాతావరణానికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుం టున్నట్లు సీఐ హెచ్చరించారు. 144సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

● 37 మందికి నోటీసులు: కలమల్ల పోలీసుస్టేషన్ పరిధిలో 37మందికి నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే నలుగురిని హౌస్ అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు.

గాలీవానకు నేలకూలిన చీనీచెట్లు



గాలీవానకు పడిపోయిన విద్యుత్తు స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్... నేలకూలిన చీనీచెట్లు

సీకేదిన్నె, జూన్ 2 : గాలీవాన, బీభత్సవానికి చింతకొమ్మదిన్నె మండలంలో దాదాపు వెయ్యి వరకు చీనీ చెట్లు నేలవాలినట్లు రైతులు తెలుపుతున్నారు. అయిదు సంవత్సరాల పాటు కష్టపడి సాకి కాపుకు వచ్చిన చీనీచెట్లు సంవత్సరానికి ఒక్కొక్క చెట్టు నుండి రూ.3 వేల వరకు ఆదాయం వచ్చే సమయంలో శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులు, వర్షానికి కమ్మవారిపల్లె, మిట్టమీదపల్లె గ్రామాల్లో రైతుల చీనీ చెట్లు పడిపోవడం జరిగింది. దీంతో ఆ గ్రామాల్లో చీనీచెట్లపైనే జీవనం సాగించే రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.మరోవైపు విద్యుత్తు స్తంభాలు సైతం గాలీవానకు పడిపోవ డంతో ప్రజలు అటు కరెంటు లేక, నీళ్లకుసైతం ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి నుండి ఆదివారం కూడా కరెంటు రాలేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు విద్యుత్తు అధికారులు మరమ్మతుల పని ఆదివారం రాత్రికి కరెంటు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు రూ.30 లక్షల వరకు రైతులకు నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. గాలుల ప్రభావానికి మండలంలో అనేక చోట్ల చెట్లు కొమ్మలు విరగడంతోపాటు రేకులు గాలికి లేచి కిందపడిపోయాయి.

గాలీవాన బీభత్సం



జమ్మలమడుగు , జూన్ 2: జమ్మలమడుగు నియోజకవర్గంలో ఆదివారం రాత్రి 7.30 గంటల నుంచి 8 గంటల మధ్య భారీగా గాలులు వీచాయి. జమ్మలమడుగు పట్టణంలో వర్షం కురిసింది.

అలాగే జమ్మలమడుగు, మైలవరం వెళ్లే దారిలో దొమ్మరనంద్యాల గ్రామం ఎస్సీ కాలనీ వద్ద నుంచి మైలవరం వెళ్లే ప్రధాన రోడ్డుకు సుమారు 5 నుంచి 6 చోట్ల చెట్లు పడిపోయాయి. కొత్త మసీదు వద్ద శ్రీచౌడేశ్వరీ దేవాలయం వద్ద రోడ్డులో పెద్ద చెట్లు గాలికి వేర్లతో కూలిపోయాయి. రాత్రి జమ్మలమడుగు నుంచి మైలవరం వెళ్లే వారు రాకపోకలు బంద్‌కావడంతో ఆటోలు తిరుగలేదు. ద్విచక్ర వాహనదారులు గ్రామంలో నుంచి అలాగే నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలు బైపాస్‌రోడ్డు గుండా వెళ్లాయి. రాత్రి దొమ్మరనంద్యాల గ్రామం అంధకారంగా మారింది. చెట్లు పడిపోవడం, విద్యుత్తు స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోయాయి.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

పోరుమామిళ్ల, జూన్ 2 : కౌంటింగ్ సందర్భంగా పోరుమామిళ్ల మండలం ఎక్కడైనా గొడవలు, అల్లర్లు ఘర్షణలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ చిరంజీవి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండలంలోని టేకూరుపేటలోని నాలుగురోడ్ల కూడలిలో గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వతేదీ షాపులు మూసివేయాలని, గుంపులు, గుంపులుగా తిరగరాదని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం కానీ, సవాళ్లు విసరడం వంటి కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. 4న అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమతమ నివాసాల్లో నుంచి బయటికి రాకుండా ఇంట్లోనే ఫలితాలు వీక్షించాలన్నారు. పోరుమామిళ్ల మండలంలో 60 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. శాంతియుత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బాణసంచా పేల్చడం, ఊరేగింపులు వంటి కార్యక్రమాలు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ గోపినాధ్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన టి.కోడూరు, ఎనమలచింతల, ఏటూరు, తాళ్లప్రొద్దుటూరు గ్రామాలలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అదేవిధంగా పొట్టిపాడు, తిమ్మాపురం,లావనూరు, వెంకయ్యకాలువ ,కొండాపురంగ్రామాలలో మొబైల్ టీమ్‌లు పర్యవేక్షిస్తున్నట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.ఈ నెల 6 వరకు విజయోత్సవ ర్యాలీలు నిషేధమని ఎస్ఐలు తెలిపారు.144 సెక్షన్,30 యాక్ట్ అమలులో ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.



పోరుమామిళ్ల, రాజుపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

రాజుపాలెం..: ఎన్నికల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత విజయోత్కసవ సంబరాలు, బాణసంచా పేల్చడం ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. పోలీసు యాక్టు అమలులో ఉంటుందని, ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదన్నారు. ఇప్పటికే గ్రామాల్లో రెండు పోలీసు మొబైల్‌టీంలుపర్యవే క్షిస్తుందని, తమ సిబ్బందే కాకుండా ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, 40 మంది పోలీసు దళాలు అందుబాటులో ఉన్నారన్నారు. పగిడాల తదితర గ్రామాల్లో పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

గోపవరం..: ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎటువంటి కార్యకలాపాలకు పోవద్దు సీఐ విక్రమసింహ తెలిపారు. మండల పరిధిలోని ప్రజలతో సమావేం ఏర్పాటు చేశారు. జనవరి 4న కౌంటింగ్ ఉన్నందున ప్రజలు మెడికల్ ఎమర్జెనీ ఉంటే తప్ప బయటికి రావద్దని, సెక్షన్ 144 పీఆర్‌పీసీ అండ్ 30 పోలీసుయాక్టు అమలులో ఉన్నందున ప్రజలు నలుగురికి మించి గుంపులుగా ఉండకూడదన్నారు. విజయోత్సవ ర్యాలీలు,ఊరేగింపులు, బాణసంచా కాల్చడం ,డీజేలు పెట్టడం చేయరాదన్నారు.

కౌంటింగ్ రోజు సహకరించాలి

ఖాజీపేట, జూన్ 2: వ్యాపారస్థులు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు కూడా సహకరించాలని సీఐ రామాంజులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎటువంటి అల్లర్లు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, మండల పరిధిలో 144 సెక్షన్ ఉందని, ప్రజలు సహకరించాలన్నారు. ఎమర్జెన్సీ పని తప్ప షికార్లకోసం రోడ్డుపైకి వస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి బాణసంచా పేల్చడం, డప్పువాయిద్యాలతో ఊరేగింపులు చేసినా కూడా జైలుపాలుకాక తప్పదన్నారు. మండల పరిధిలో కొత్త వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

200మందికి నోటీసులు

ఎర్రగుంట్ల, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎర్రగుంట్ల అర్బన్ పరిధిలో 200మందికి నోటీసులు ఇచ్చినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. అలాగే 45మందిరౌడీషటర్స్‌ను గుర్తించామన్నారు. అలాగే 34మంది హౌస్‌అరెస్టు, స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టిపోవాలన్న నిబంధనలు కూడా అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఘర్షణ జరిగిన పెద్దనపాడు గ్రామంలో నిరంతర పికెటింగ్‌ను కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు. అలాగే నిరంతర గస్తీ తిరిగే నాలుగు రకాల ఫోర్స్ కూడా పనిచేస్తోందన్నారు. కౌంటింగ్, అనంతరం ఘర్షణ వాతావరణానికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటున్నట్లు సీఐ హెచ్చరించారు. 144సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

● **37 మందికి నోటీసులు:** కలమల్ల పోలీసుస్టేషన్ పరిధిలో 37మందికి నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే నలుగురిని హౌస్ అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా 144సెక్షన్‌తో పాటు పోలీసుపహారాను కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

భగవద్గీత పఠనంతో నైతిక విలువలు



బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 2: భగవద్గీతను పఠించడం వలన నైతిక విలువలు అలువడుతాయని క్రిష్ణచైతన్య స్వామి పేర్కొన్నారు. ఆదివారం వేదాంతం లక్ష్మణాచార్యుల ఆశ్రమంలో చిన్నారులకు ఉచిత భగవద్గీత శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భగవద్గీతలోని 10వ అధ్యాయం విభూది యోగంపై శిక్షణ ఇచ్చామన్నారు. నెల రోజుల శిక్షణ అనంతరం ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రధాన కార్యదర్శి మచ్చా ప్రభాకర్, కోశాధికారి అవ్వారు ప్రసాద్, వెంకటరమణారెడ్డి, సుబ్రహ్మణ్యం, శివ, శంకరయ్య, జానపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏమారితే..రోడ్డు ప్రమాదమే..?

● గొర్రెల సంత మారదు ● దారి ఇవ్వరు ● ఇబ్బందుల్లో ప్రజలు



ప్రధాన రోడ్డు పక్కన మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రోడ్డుకు అడ్డంగా గొర్రెల సంత, ప్రొద్దుటూరు రోడ్డులో రోడ్డుపైకి చేరిన గొర్రెల సంత

జమ్మలమడుగు, జూన్ 2: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి ఏమాత్రం లేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ప్రధానంగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు రోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన సర్కిల్‌లో రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా, రోటరీ నగర్ వెళ్లేవారికి తీవ్ర ఇబ్బందులు ఉన్నాయి. ప్రతి వారంలో రెండు రోజులు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డు పక్కనే గొర్రెల వ్యాపారులు సంత నిర్వహించడం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. గతంలో ప్రొద్దుటూరు రోడ్డులో ధర్మాపురం వద్ద ఒక టిప్పర్ రోడ్డు పక్కన రైతులు ఉదయం అల్పాహారం తింటున్న సమయంలో దూసుకునిపోయిన సమయంలో టిప్పర్ డ్రైవర్ తోపాటు ఇద్దరు రైతులు ఘటనా స్థలంలో మృతిచెందారు. అలాగే ఇదే దారిలో అనేక చోట్ల రోడ్డుపై ప్రమాదాలు జరిగాయి. వాహనాలు దూసుకెళ్లి గాయపడినవారు లేకపోలేదు. అలాగే నియోజకవర్గంలోని ముద్దనూరులో రైల్వేస్టేషన్ ట్రాక్ వద్ద నుంచి లోడుతో వెళుతున్న లారీ చలపతి అనే ఇంటిలోకి దూరి ఘటనా స్థలంలో లారీ డ్రైవర్ మృతిచెందగా భారీగా ఆస్తినష్టం జరిగింది. ఇలాంటి ఘటనలు ప్రజలు చూస్తునే ఉన్నా అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలిస్తున్నా నిర్లక్ష్యమైతే పోలేదని తెలుస్తోంది. నష్టపోయినవారికి ప్రభుత్వం జిల్లా అధికారులు చెల్లించాలనే ఆలోచన లేదు. నామమాత్రంగా అధికారులు పరిశీలించడం, ఘటనకు సంబందించిన వివరాలు సేకరించడం, ఆ తర్వాత పట్టించుకోకపోవడం జరుగుతోంది. ఇదే పరిస్థితి గొర్రెల సంత వద్ద ఏదైనా వాహనం దూసుకెళితే ఎంతమందికి ప్రమాదం జరుగుతుందో అధికారులు వెంటనే నిర్లక్ష్యం వీడి గొర్రెల సంతను ఎక్కడైనా ఖాళీ స్థలాల్లో మార్చడం మంచిదని పలువురు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఆదాయం పక్కనబెట్టి గొర్రెల సంత వ్యాపారులకు స్థలం చూపెట్టి సంతను మార్చాలని కోరుతున్నారు.

గాలీవాన బీభత్సం

● రాకపోకలు బంద్

జమ్మలమడుగు , జూన్ 2: జమ్మలమడుగు నియోజకవర్గంలో ఆదివారం రాత్రి 7.30 గంటల నుంచి 8 గంటల మధ్య భారీగా గాలులు వీచాయి. జమ్మలమడుగు పట్టణంలో వర్షం కురిసింది. అలాగే జమ్మలమడుగు, మైలవరం వెళ్లే దారిలో దొమ్మరనంద్యాల గ్రామం ఎస్సీ కాలనీ వద్ద నుంచి మైలవరం వెళ్లే ప్రధాన రోడ్డుకు సుమారు 5 నుంచి 6 చోట్ల చెట్లు పడిపోయాయి. కొత్త మసీదు వద్ద శ్రీచౌడేశ్వరీ దేవాలయం వద్ద రోడ్డులో పెద్ద చెట్లు గాలికి వేర్లతో కూలిపోయాయి. రాత్రి జమ్మలమడుగు నుంచి మైలవరం వెళ్లేవారు రాకపోకలు బంద్‌కావడంతో ఆటోలు తిరుగలేదు. ద్విచక్ర వాహనదారులు గ్రామంలో నుంచి అలాగే నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలు బైపాస్‌రోడ్డు గుండా వెళ్లాయి. రాత్రి దొమ్మరనంద్యాల గ్రామం అంధకారంగా మారింది. చెట్లు పడిపోవడం, విద్యుత్తు స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోయాయి.



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

జమ్మలమడుగు, జూన్ 2: జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట వీధిలో శిరి నిరాశ్రయుల వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్ ప్యాకెట్లు ముద్దనూరు ఏవో మారెడ్డి కృష్ణారెడ్డి అందజేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ తన కూతురు దివ్య జన్మదినం పురస్కరించుకుని అనాథ వృద్ధులకు మధ్యాహ్నం భోజనంతోపాటు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెడ్డి రాధ, కుమారుడు నిహాల్‌రెడ్డి, వృద్ధులు పాల్గొన్నారు.

అంధకారంలో గ్రామీణ రోడ్లు



అంధకారంలో మోరగుడి రోడ్డు

జమ్మలమడుగు, జూన్ 2: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి, గ్రామంతో పాటు పలు గ్రామాల్లో ఇటీవల రాత్రి సమయాల్లో విద్యుత్తు అధికారులు కరెంటు తొలగిస్తున్నట్లుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు రాత్రి 9 గంటల నుంచి సుమారు 11 గంటల వరకు రెండు గంటలపాటు కరెంటు లేక అంధకారంలో రోడ్లు ఉన్నాయి. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన వీధుల్లోనే కాకుండా ఇళ్లకు కరెంటు కట్ చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అసలే ఎండాకాలం. గాలిలేక ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు అల్లాడుతున్నారు. రాత్రి సమయాల్లో కరెంటు తొలగిస్తే ఎంత దారుణంగా ఉంటుందోనని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కరెంటు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



జమ్మలమడుగు, జూన్ 2: ఈనెల 4వ తేదీ కడపలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని జమ్మలమడుగులో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి పోలీసు అధికారులు పర్యవేక్షణలో పోలీసు సిబ్బందిని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు జమ్మలమడుగులో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది. పోలింగ్‌రోజు జమ్మలమడుగు పట్టణంలో 116, 117 పోలింగ్ బూత్‌ల వద్ద గొడవ జరగడంతో పోలీసు అధికారులు భద్రత పెంచారు. ఆరోజు నుంచి జమ్మలమడుగు పట్టణంలో, గ్రామాల్లో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. 144 సెక్షన్ అమలుతోపాటు జూన్ 4వ తేదీ కఠినమైన కర్ఫ్యూ అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అయితే జూన్ 3వ తేదీ సాయంత్రం నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులకు సంబంధించి చర్యలు తీసుకున్నారు. అయితే బ్రాందీషాపుల వారు బయట అధిక ధరలకు విక్రయించకుండా పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే జమ్మలమడుగు పట్టణంలోకి వాహనాల ప్రవేశం లేకుండా గ్రామ శివార్లలో పోలీసు పికెట్‌ను 3వ తేదీ సోమవారం నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం ప్రొబేషనరి డీఎస్పీ శ్రీకాంత్, వారి సిబ్బంది పట్టణంలో పర్యవేక్షించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు పట్టణంలోని అన్ని ప్రాంతాలు ప్రత్యేక నిఘాతోపాటు పరిశీలించి లాడ్జీలను సైతం తనిఖీ చేయడం జరుగుతుందని అధికారులు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఏది ఏమైనా ఆదివారం సాయంత్రం నుంచి పట్టణంలో పోలీసు బలగాలు పికెట్ ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు దుకాణాలన్నీ మూసివేయాలని ప్రత్యేకంగా టీ దుకాణాలు మూసివేయాలని చెప్పినట్లుగా తెలిసింది. ఎక్కడైనా గుంపులుగా ఉండరాదని హెచ్చరించారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 2: విద్య ద్వారా విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో తొగటవీర క్షత్రియ విద్యార్థులకు 12వ వార్షికోత్సవ ప్రతిభా పురస్కాలను అందజేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. వైద్య విద్యార్థి శీలీనాకు రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. మొత్తం 85 మంది విద్యార్థులకు రూ.1.90 లక్షలలను ప్రతిభా పురస్కారాలుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, కార్యదర్శి పల్లా శేషయ్య, కోశాధికారి గంజికుంట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, మోతుకూరి సుబ్బయ్య, పల్లా శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ క్లబ్ అధ్యక్షుడిగా చరణా వెంకటకిశోర్



వెంకటకిశోర్‌ను అభినందిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 2: జమ్మలమడుగు శ్రీ ఆర్యవైశ్య సభ అనుబంధ సంస్థ అయిన శ్రీ వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడుగా చరణా వెంకటకిశోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రమణ్యం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2024-26 సంవత్సరానికిగాను చరణా వెంకటకిశోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు వెంకటనాగయ్య, ప్రధాన కార్యదర్శి వెంగయ్య, యువజన సేవా సంఘం అధ్యక్షుడు సుమన్‌కుమార్, సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

నేటి రాత్రి నుంచి మద్యం షాపులు బంద్

● షాపుల వద్ద ఎగబడ్డ మందుబాబులు



మద్యం షాపుల వద్ద మందుబాబులు

ఎర్రగుంట్ల, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలోపెట్టుకుని 3వ తేదీ రాత్రి నుంచి మద్యం షాపులు మూయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సుభాషిణి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న షాపులన్నింటి తోపాటు బార్లు రాత్రి 11గంట లకు, రెస్టారెంట్లు రాత్రి 10గంటలకు మూసివేస్తున్నట్లు తెలిపారు. తన పరిధిలోని 84షాపులకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు.

● మద్యం షాపులు 3వ తేదీ రాత్రి నుంచి 5వ తేదీ ఉదయం వరకు మూస్తుండటంతో మందుబాబులు షాపుల వద్ద ఎగబడ్డారు. దీంతో దాదాపు అన్ని షాపులు కిటకిటలాడాయి. దీనికి తోడు ఆదివారం కూడా కావడంతో మరింత రద్దీ పెరిగింది. ప్రతి రోజూ ఉదయాన్నే మద్యం తాగే అలవాటు ఉన్నవారు తెల్లవారుజామునే బ్లాకులో కొని తాగుతున్నారు. బ్లాకులో అమ్ముకునే వారు ముందస్తుగా స్టాకు పెట్టుకుంటున్నట్లు తెలిసింది. దీంతో మద్యంషాపుల వద్ద చాలా రద్దీ పెరిగిందని పేర్కొంటున్నారు.

సౌకర్యాల లేమిలో అంగన్వాడీ కేంద్రాలు

● అసంపూర్తిగాఉన్న నాడు నేడు పనులు ● నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణ పనులు

కాశినాయన జూన్ 2: మండలంలో అంగన్వాడీ కేంద్రాలు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. పాలకుల మాటలకు క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు పొంతన ఉండదు. ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ఒక మోడల్ కేంద్రంగా నిర్వహించాలని పాలకులు ఆదేశిస్తున్నారేగాని క్షేత్రస్థాయిలో అందుకుతగ్గ ఏర్పాట్లు చేయలేకపోతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా 45 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 10 మినీ,35 మెయిన్ సెంటర్లు నిర్వహించబడుతున్నాయి.ఈకేంద్రాల పరిధిలో 7 నెలల నుంచి 3సంవత్సరాల లోపు పిల్లలు850 మంది ,3సంవత్సరాల నుంచి 5సంవత్సరాలోపు ప్రీస్కూల్ పిల్లలు 662 మంది, బాలింతలు,గర్భిణులు 329 ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి సెంటర్‌కు వసతులతోకూడిన పక్కాభవనం,విద్యుత్ సౌకర్యం, ఆటవస్తువులు ఏర్పాటుచేయడంతో పాటు ప్రతి మినీ కేంద్రానికి ఒక టీచర్,మిగలిన కేంద్రాలకు టీచర్‌తోపాటు ఆయాను నియమించాలి. వీరంతా కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాల్సి ఉంది. కానీ ఎక్కువ శాతం కేంద్రాలకు పక్కాభవనాలు లేకపోవడంతో చిన్నారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగన్వాడీ వ్యవస్థ ఏర్పడి రెండు దశాబ్దాలు గడుస్తూ నేటికీ పక్కాభవనాల నిర్మాణం పూర్తిస్థాయిలో ఏర్పాటుకాలేదు. ప్రస్తుతం 45 అంగన్వాడీ కేంద్రాలకు గాను 21 కేంద్రాలకు సొంత భవనాలు,8 కేంద్రాలు రెంట్‌ఫ్రీ కింద,మిగిలిన కేంద్రాలు బాడుగ ఇళ్లలో నడుస్తున్నాయి. దీంతో సరైన గాలి వెలుతురు లేని పాడుబడిన గదుల్లో కేంద్రాలను అతికష్టంపై నిర్వహించాల్సి వస్తుంది. మండలానికి నాడు నేడు కింద ప్రభుత్వం 10 భవనాలు మంజూరుచేసింది. కానీ నిధులకొరతతో చాలావరకు భవనాల పనులు నత్తనడకన సాగుతూ అసంపూర్తిగానే ఉన్నాయి. బాలాయపల్లె ఎస్సీకాలనీలో స్థల సమస్యమూలంగా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. కేఎన్ కొట్టాల, గొంటువారిపల్లె గ్రామాల్లోని భవనాలు స్లాబ్‌కు నోచుకోలేదు. ఇప్పటికీ ఓబులాపురం,పిట్టిగుంట,కేఎన్‌కొట్టాల తదితర గ్రామాల్లో ప్రైవేట్ భవనాలల్లోనే కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈవిషయంపై అంగన్వాడీ పర్యవేక్షకురాలు చంద్రకళను వివరణకోరగా మండలానికి నాడు నేడుకింద 10 కొత్త భవనాలు మంజూరు అయ్యాయి. బాలాయపల్లెలో కోర్టు కేసుమూలంగా పనులు మొదలు కాలేదు. మిగిలిన గ్రామాల్లో భవననిర్మాణ పనులు తుదిదశకు వచ్చాయి. మిగిలిన పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల కోసం ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయామన్నారు. ఉన్నంతలో చిన్నారులకు ఇబ్బందులు రాకుండా కేంద్రాలు నడిపిస్తున్నామన్నారు.



కేఎన్ కొట్టాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్వాడీ భవనం